‘మత్స్యకార భరోసా’ హుళక్కేనా?

కడలి సంపదతో కడుపు నింపుకొనే మత్స్యకారుల జీవనం అత్యంత దుర్భరం. నిత్యం వేటకు వెళితే గానీ పూట గడవని పరిస్థితి. రెక్కాడితే గానీ డొక్కాడని గంగపుత్రులు వేటకు వెళ్లకపోతే ఆ కుటుంబాలు పస్తులుండాల్సిందే. ఇంతగా కడలి సంపదపై ఆధారపడి బతుకు బండి ఈడుస్తున్న మత్స్యకారులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. వేట విరామం సమయంలో వైఎస్ జగన్ సర్కారు మత్స్యకార భరోసా కింద రూ.10 వేలు అందించి ఆసరాగా ఉంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఎలాంటి సహకారం లేకపోవడంతో విలవిలలాడుతున్నారు. వేట ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. విరామం సమయంలో చేసిన అప్పులు తీరక మదనపడుతున్నారు. మత్స్యకార భరోసా అందకపోవడంతో తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక నిట్టూరుస్తున్నారు.


జాలరిపేట తీరంలో నిలిచి ఉన్న పడవలు

- ఆర్థిక ప్రోత్సాహం లేక మత్స్యకారుల విలవిల
- వేట ప్రారంభమై 2 నెలలు కావస్తున్నా అందని సాయం

ఎంవీపీ కాలనీ : తూర్పు నియోజకవర్గంలో దాదాపు 6 వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. అందరికీ చేపల వేట ప్రధాన జీవనాధారం. అప్పుఘర్, వాసవానిపాలెంలలో 2 వేల వరకు.. పెదజాలరిపేట ప్రాంతంలో దాదాపు 4 వేల వరకు మత్స్యకార కుటుంబాలు నివాసముంటున్నాయి. తీర ప్రాంతాన్ని ఆనుకొని వీరంతా జీవిస్తున్నారు. కుటుంబంలోని మగవారంతా వేటకు వెళ్లి చేపలు పడుతుంటారు. మహిళలు వాటిని నగరంలోని వివిధ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు. ఇలా నిత్యం వేటను నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారులకు కుటుంబం పోషణతో పాటు పిల్లలను చదివించుకోవడం భారంగా ఉంటోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు నెలల పాటు చేపల వేటకు విరామం ప్రకటిస్తోంది. ఈ సమయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరిట సాయమందించి ఆదుకుంది. మత్స్యకారులకు ప్రస్తుతం ఆ పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారు.

రూ.10 వేలు ఇచ్చిన జగన్ సర్కారు

మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా గత ఐదేళ్ల పాటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసింది. ఏటా వేట విరామం సమయంలో అర్హులైన ప్రతి మత్స్యకారుడికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేసింది. విరామం సమయంలో కుటుంబ పోషణతో పాటు బోట్లు, పడవలను వేటకు సిద్ధం చేసుకునేందుకు ఈ ఆర్థిక తోడ్పాటు మత్స్యకారులకు పెద్ద ఎత్తున మేలు చేసింది. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మత్స్యకార భరోసాను కొండెక్కించింది. దీంతో వేట ప్రారంభమై రెండు నెలలు గడిచినా సాయం అందక మత్స్యకార ప్రాంతాల ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.


వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు(ఫైల్)

ఆర్థిక భరోసాను కొనసాగించాలి

రాష్ట్రంలోని మత్స్యకారులకు ‘మత్స్యకార భరోసా’పేరుతో వైఎస్సార్‌సీపీ ఇచ్చిన ఆర్థిక భరోసాను కూటమి ప్రభుత్వం కూడా కొనసాగించాలి. ఈ ఆర్థిక భరోసాతో వేటకు వెళ్లే మత్స్యకారులంతా ఎంతో లబ్ధి పొందారు. వేట విరామం సమయంలో కుటుంబ పోషణతో పాటు వేట సామగ్రి, వలలు, బోట్లు సిద్ధం చేసుకోవడానికి చేసిన అప్పు నుంచి ఈ నిధుల ద్వారా ఉపశమనం పొందారు. తక్షణం మత్స్యకార భరోసా మంజూరు చేయాలి.

– కనకరాజు, మత్స్యకారుడు

మత్స్యకారులకు తీవ్ర నష్టం

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత్స్యకారులకు గతంలో లభించిన తోడ్పాటు కరువైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు ఇచ్చిన మత్స్యకార భరోసా నిలిపివేయడమే ఇందుకు నిదర్శనం. వేట విరామం ముగిసిన తరువాత ఏటా జూన్‌లోనే మత్స్యకారులకు రూ.10 వేలు మత్స్యకార భరోసాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించేది. అయితే ఇటీవల ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మత్స్యకార భరోసాను కొండెక్కించడంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– వాసుపల్లి ఎల్లాజీ, 18వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు

నేటి నుంచి ముత్యామాంబ జాతర



ఆరిలోవ: ఆరిలోవ కాలనీ శివాజీనగర్–2 లో ముత్యమాంబ అమ్మవారి జాతర బుధవారం ప్రారంభం కానుంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ జాతర కోసం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇందులో భాగంగా బుధ, గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలి

గోపాలపట్నం : నేవల్ ఆర్మ్‌మెంట్ డిపో సివిల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు భరోసా కల్పించాలని, సభ్యుల లోన్లు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ఎన్ఏడీ ప్రధాన గేటు వద్ద నేవల్ ఆర్మ్‌మెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్ఏడీ సివిలియన్ కోఆపరేటివ్ సొసైటి పాలక వర్గం సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోయారు. సభ్యుల లోన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయకుండా తాత్సారం చేస్తుందని దుయ్యబట్టారు. పాలక మండలి తీరు భయాందోళనలకు గురి చేస్తోందన్నారు. గతంలో ఉన్న పాలక మండలి సలహా కమిటీ ఏర్పాటు చేసుకుని సభ్యులకు సకాలంలో లోన్లు మంజూరు చేసేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా కార్మికులకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన లోన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

బీచ్ రోడ్డు: రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేసుకుంటున్న మహిళను వేధిస్తున్న ఓ వ్యక్తిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత 30 ఏళ్లుగా అన్నపూర్ణ అనే మహిళ సీబీఎం కాంపౌండ్ ప్రాంతంలో వేస్ట్ పేపర్ మెటీరియల్ వ్యాపారం చేస్తోంది. ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న పల్లా మార్టిన్ సతీష్‌కుమార్ అనే వ్యక్తి కొద్ది నెలలుగా ఆమెను నెలకు రూ.5వేలు ఇవ్వాలని వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కనకమాంబ జాతర


జాతరలో పులివేషాల సందడి

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో కొలువుదీరిన కనకమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనుపోత్సవంలో భాగంగా సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస : దక్షిణ భారత హిందీ ప్రచారసభ సెప్టెంబరులో నిర్వహించే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపు గడువును పెంచినట్టు భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 31 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 25 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. ఉచిత శిక్షణ, మిగిలిన వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని సూచించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార: విశాఖ నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దర్ని ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.విజయకుమార్ తెలిపిన వివరాలు ఇలా.. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 24 కిలోల గంజాయిని తమిళనాడుకు చెందిన ప్రేమనిసార్, శిబరాజులు కొనుగోలు చేసి సోమవారం రాత్రి రెండు బ్యాగులతో విశాఖ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. సమాచారం తెలుసుకున్న ఫోర్తుటౌన్ పోలీసులు వారిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయి తేస్తే నగదు ఇస్తానని తమిళనాడుకు చెందిన రియాజ్ అనడంతో అరకు వచ్చి గొనుగోలు చేశామని నిందితులు వెల్లడించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వేతన ఒప్పందం అమలుకు త్వరలో దీక్షలు

దాబాగార్డెన్స్: పెండింగ్‌లో ఉన్న వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని, పోర్టులో ప్రైవేటీకరణ ఆపాలని ఈ నెల 25, 26 తేదీల్లో నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. రామలింగేశ్వరరావు, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జె. సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం సిటు కార్యాలయంలో పెండింగ్ సమస్యలతో కూడిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 జనవరి నుంచి అమలు చేయాల్సిన వేతన పెంపుదలకు సంబంధించి చర్చలకు పిలవలేదన్నారు. వేతన ఒప్పంద కాలం ముగిసి ఇప్పటికి 30 నెలలు పూర్తయిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా షరతులు విధించి కాలయాపన చేస్తుందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

మురళీనగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నిచ్చి ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మానవసేవే మాధవ సేవ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యుల సమావేశం శ్రీదేవి పార్కులో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి స్థానికులకు దత్తనివ్వడంతో పాటు పార్కుల్లో బ్యూటిఫికేషన్‌కు సంబందించిన మొక్కలు దాతల ద్వారా అందిస్తామన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు నెల చివరి వారంలో అనాథాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సెప్టెంబరులో నిర్వహించే వినాయక చవితికి మట్టి వినాయక విగ్రహాలు, వినాయక వ్రతకల్పం పుస్తకాలు పంపిణీ చేయాలని సభ్యులు నిర్ణయించారు. ఇందుకు రూ.20,000లు అవసరమవుతుందని అంచనా వేశారు. సంఘం ఉపాధ్యక్షుడు వరప్రసాద్ తన వంతుగా రూ.10,000లు విరాళంగా అందిస్తానని ప్రకటించారు. సెప్టెంబర్‌లో గౌరవ అధ్యక్షుడు ప్రసాదరాజు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించడానికి కమిటీ సభ్యులు ఆమోదం తెలియజేశారు.గురు పౌర్ణమి, సింహాచలం గిరి ప్రదక్షణ సందర్భంగా కమిటీ సభ్యులు సతీష్ కుమార్, కుమార్, శ్రీనివాస్ సంయుక్తంగా నిర్వహించనున్న ప్రసాద వితరణ కార్యక్రమంలో సభ్యులు పాల్గొనాలని నిర్ణయించారు.

‘హ్యాండ్లూమ్ సారీ వాక్ ‘పై అవగాహన


గైస్‌లో ‘హ్యాండ్లూమ్ సారీ వాక్ ’ పోస్టర్ విడుదల

మురళీనగర్: స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ఆధ్వర్యంలో ‘హ్యాండ్లూమ్ సారీ వాక్’ పై గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ కెమికల్ ఇంజినీరింగ్ (గైస్)లో విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కేవీ రమణతో కలిసి సభ్యులు ‘హ్యాండ్లూమ్ సారీ వాక్’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆర్కే బీచ్ విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌లో ఆగస్టు 4న నిర్వహించనున్న త్రీ కే వాక్ కార్యక్రమానికి 7వేల మంది మహిళలు హాజరవుతారని స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో గైస్ విద్యార్థినులు పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్ రాజ్ కుమారి, పి శేఖర్, ఎ. శైలజ, డి.విజయ స్వాతి పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి


చిప్పాడ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

తగరపువలస : చదువులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. మంగళవారం ఆమె భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ముందుగా 10వ తరగతి విద్యార్థుల గదిలో ప్రవేశించి బయాలజీ, గణితం, హిందీ, ఫిజిక్స్ నోట్స్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం 6, 7 తరగతులకు ఏక్టివిటీలు తయారు చేస్తున్న ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం, ‘నాడు – నేడు’ పథకం కింద నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.వి.టి.రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, ఎస్.విజయకుమార్, ఎ.హేమసుందరరావు, ఆర్.త్రివేణి, డీవీ సత్యవతి, అనురాధ, రాజేశ్వరి, రామస్వామి, రమేష్, సుశీల్‌కుమార్ తదితరులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

మందుబాబులకు రూ.1.6 లక్షల జరిమానా

భీమునిపట్నం : భీమిలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి న్యాయమూర్తి మంగళవారం జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ మేరకు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు 16 మంది దొరకగా వారికి 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి.సౌజన్య ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.6 లక్షల జరిమానా విధించారు.

ఉద్యానవనాల సాగు లాభదాయకం

విశాఖ విద్య : ఉద్యానవనాల సాగు ఎంతో లాభదాయకమని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మద్రిపాలెం రైతు బజారులో మంగళవారం ఉద్యానవనాల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్ల వద్ద సాగు చేస్తూ, రైతు బజార్లలో విక్రయాలకు కూరగాయలు తీసుకొస్తున్న పలువురు రైతులతో మాట్లాడారు. సాగులో వారి అనుభవాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన వనాల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. తక్కువ విస్తీర్ణంలోనే రోజువారీ ఆదాయం సంపాదించేలా పంటలు పండించవచ్చన్నారు. విత్తనాల కొనుగోలు, ఎరువుల వాడకం గురించి పూర్తి స్థాయిలో తెలుసుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ పరంగా అందించే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యానవన శాఖాధికారి సోని, విస్తరణ అధికారి త్రినాథ్, రైతుబజారు ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

• నిరంతరం గొడవలు.. దాడులు

వీధుల్లో వీరంగం


గంజాయి బ్యాచ్‌లపై నిఘా కోసం నియామకమైన ప్రత్యేక పోలీస్ బృందం


ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్న మందుబాబులు

- ఆరిలోవ, ఎండాడ పరిసర ప్రాంతాల్లో అరాచకాలు
- గుంపులుగా గంజాయి బ్యాచ్‌లు
- మందుబాబులు హల్‌చల్
- ఒంటరిగా ప్రయాణించేవారిపై దాడులు

ఆరిలోవ: ఈ నెల 11న అర్ధరాత్రి సమయంలో జాతీయ రహదారిపై ఎండాడ కూడలి సమీపంలో ఓ లారీ డ్రైవర్‌పై 8 మంది గంజాయి బ్యాచ్ దాడి చేసి రూ.10 వేలు నగదు, సెల్ ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు.

- ఈ నెల 12న సాయంత్రం ముడసర్లోవ రోడ్లలో వాకింగ్ చేస్తున్న ఓ వ్యక్తి మెడలో దుండగులు బంగారు గొలుసును దొంగలించి పారిపోయారు.
- వారం క్రితం ఆరిలోవ కాలనీలో ఓ కిరాణా షాపు యజమానిపై మద్యం తాగిన మైకంలో కొందరు యువకులు దాడి చేసి గాయపరిచారు.
- రెండు వారాల కిందట టీబీసీ పాయింట్ వద్ద ఓ పానీపూరి వ్యాపారిపై గంజాయి బ్యాచ్ దాడి చేసి, సామగ్రిని నేలపాలు చేసింది.
- నాలుగు నెలల కిందట విశాఖ కేంద్ర కారాగారం వార్డర్‌ను ముడసర్లోవ రోడ్డులో రామకృష్ణాపురం వద్ద గంజాయి మత్తులో కొందరు యువకులు అడ్డగించి దాడి చేశారు.
- ఆరు నెలల కిందట ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై ముడసర్లోవ రిజర్వాయరు వెనక రోడ్లలో గంజాయి బ్యాచ్ దాడి చేసింది. అతని వద్ద డబ్బులు లేకపోవడంతో ఆగ్రహించి దుస్తులు విప్పించి పంపించారు.

ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. గంజాయి బ్యాచ్‌లు, మందుబాబుల హల్‌చల్ ఎక్కువైపోయింది. వీధుల్లో విచ్చలవిడిగా గంజాయి తాగిన యువకులు గుంపులుగా తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వీరికి తోడు మందుబాబుల హడావుడి అంతా ఇంతా కాదు. గంజాయి, మద్యం తాగిన మైకంలో గ్యాంగ్‌లు గొడవలకు దిగడం, ఒంటరిగా రోడ్డుపై ప్రయాణించే వారిపై దాడులకు పాల్పడడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

సీపీ ఆగ్రహం.. ప్రత్యేక నిఘా

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి దీనిపై సీరియస్‌గా తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించిన ఆయన ఇక్కడి పరిస్థితులను పరిశీలించారు. మందుబాబులు, గంజాయి బాబులకు అడ్డాగా మారిన పలు ప్రాంతాలను స్థానిక పోలీసులతో కలసి సందర్శించారు. గంజాయి, మందుబాబులపై ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో పాటు ఈ పోలీస్ స్టేషన్‌కు 15 మంది ఏఆర్ పోలీసుల బృందాన్ని అదనంగా కేటాయించారు. ఈ 15 మందితో పాటు ఆరిలోవ పోలీసులు ప్రతి రోజు సాయంత్రం వేళల్లో బ్యాచ్‌ల వారీగా కాలనీలు, నిర్మానుష్య ప్రదేశాల్లో నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి బహిరంగంగా మద్యం తాగిన సుమారు 20 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. వారిపై కేసులు నమోదు చేశారు. వీధుల్లో వీరంగం వేస్తూ రోడ్లపై గుంపులుగా తిరుగుతున్న గంజాయి బాబులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గంజాయి బ్యాచ్‌లు హడావిడి చేస్తున్న ఆరిలోవ కాలనీ, ముడసర్లోవ, హెల్త్‌సిటీ, పెదగదిలి శ్మశానం, విమ్స్ వెనుక భాగం, తోటగరువు హైస్కూల్ వెనుక భాగం, రవీంద్రనగర్, ఇందిరానగర్, జోడుగుళ్లపాలెం, విశాఖ వ్యాలీ స్కూల్ వెనుక ప్రాంతం, సాగర్‌నగర్, ఎండాడ ప్రాంతాలతో పాటు కూడళ్లు, బహిరంగ ప్రదేశాలు, బస్టాప్‌లలో నిఘా పెట్టారు. రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తే ఆకతాయిల ఆగడాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు చెబుతున్నారు. నిఘా నిరంతరం కొసాగించాలని స్థానికులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై సదస్సు నేడు


ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహిస్తున్నారు. ‘సంక్షోభంలో విశాఖ ఉక్కు – పరిష్కారం ఎలా ’ అనే అంశంపై సాయంత్రం 5.30 గంటలకు ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో సదస్సు ప్రారంభం కానుంది. స్టీల్‌ప్లాంట్ పూర్వ సీఎండీ వై.శివసాగరరావు, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జె.డి.లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు సదస్సులో పాల్గొనున్నారు. సదస్సుకు ఉద్యోగులందరూ హాజరు కావాలని సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి కోరారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం


మాట్లాడుతున్న ఎస్ఐ చిన్నమనాయుడు

భీమునిపట్నం : జీవితాలను సర్వనాశనం చేసే మాదక ద్రవ్యాల జోలికి ఎవరూ వెళ్లొద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ చిన్నమనాయుడు సూచించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు తీసుకునే వారు అన్ని విధాలుగా నష్టపోతారని, అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ బానిసలు కావొద్దని హెచ్చరించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌లో కుక్కల బెడద


రుషికొండ బీచ్‌లో పర్యాటకుల పక్కనే కుక్కలు

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కుక్కల బెడద తీవ్రంగా వుంది. బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన ఈ బీచ్‌కు నిత్యం వేలాది మంది పర్యాటకులు దేశ విదేశాల నుంచి వస్తుంటారు. అయితే ప్రస్తుతం ఇక్కడకు వచ్చిన పర్యాటకులను పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జీవీఎంసీ అధికారులు ఇక్కడి కుక్కలను పట్టుకున్నారు. అయితే వాటిని బీచ్‌కు కాస్త దూరంలో విడిచిపెట్టి మమ అనిపించారు. దీంతో అవి మరలా తీరానికి చేరుకున్నాయి. ప్రస్తుతం పర్యాటకులు ఇక్కడి బీచ్‌కు రావాలంటే ఆందోళన చెందుతున్నారు. బీచ్‌లో కుక్కలను కట్టడి చేయాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.